

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 17 జూన్ 2024



నాది మీ పార్టీనే..

రాష్ట్రంలో అధికారం మారడంతో నిన్నటి వరకు వైసీపీకి తొత్తులుగా పనిచేసిన కొందరు అధికారులు నేడు మనుగడ కోసం పోరాటం మొదలుపెట్టారు. ఉన్న సీటును కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. దేవదాయశాఖలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధికారిణిగా ఉన్న ఉద్యోగి తీరే దీనికి నిదర్శనం. వైసీపీ కీలక నేత విజయసాయిరెడ్డికి వీరభక్తురాలిగా గుర్తింపు పొందిన ఈమె ప్రస్తుతం తన విధేయతను మార్చేసుకున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ తాను టీడీపీ మద్దతురాలినని, తనను ప్రస్తుతం ఉన్న హోదాల్లోనే కొనసాగించాలని విన్నపాలు చేసుకుంటున్నారు. ఈమె తీరుపై దేవదాయశాఖ ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు.



ఇక్కడే కొనసాగించాలని ప్రభుత్వానికి విజయసాయి భక్తురాలి విన్నపాలు

- సర్కార్ మారడంతో మారిన విధేయత
- టీడీపీ ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- సీటు కోసం దేవదాయ శాఖ ఉన్నతాధికారిణి పాట్లు
- రెండు జిల్లాలకు ఆమే అధికారిణి.. తొలి నుంచీ ఆరోపణలే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ కీలక నాయకుడు విజయసాయిరెడ్డి అండతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఉద్యోగిగా ఉన్న అధికారిణి చెలరేగిపోయారు. ఆయన ఆశీస్సులతోనే ఆమె 2022లో కృష్ణా జిల్లాలోని నెమలి దేవస్థానానికి బదిలీ అయ్యారు. వెనువెంటనే ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలను కూడా ఆమెకే అప్పగించారు. ఒకే ఉద్యోగికి రెండు కీలక పదవులు కట్టబెట్టడం.. అది కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి ఇవ్వడంపై విమర్శలు రావడంతో కొద్ది కాలానికి ఎన్టీఆర్ జిల్లాకు వేరే అధికారిణిని నియమించారు. అయితే ఆమెకు బాధ్యతలు అప్పచెప్పకుండా ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించి ఇబ్బందులకు గురి చేశారు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో చివరికి బాధ్యతలు అప్పగించి, ఈమె కృష్ణాజిల్లా బాధ్యతలు చేపట్టారు. అయితే విజయసాయి అండ ఉండటంతో పట్టుబట్టి మరీ కొద్ది రోజులకే మళ్లీ ఎన్టీఆర్ జిల్లా అధికారిణిని బదిలీ చేయించి, ఆ స్థానంలో అదనపు బాధ్యతలు తనకే వచ్చేలా ఆదేశాలు జారీ చేయించుకున్నారు. రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించినా ఆమె ఏ రోజూ సక్రమంగా కార్యాలయానికి వచ్చే వారు కాదని ఉద్యోగులే చెబుతారు. ఓ దశలో స్పందన కార్యక్రమానికి వరుసగా గైర్హాజరవుతుండటంతో కృష్ణాజిల్లా కలెక్టర్ ఆమెను మందలించి షోకాజ్ నోటీసు కూడా జారీ చేశారు. విజయసాయి అండతో తనకు నచ్చిన వారికి ఆలయాల్లో పోస్టులు ఇప్పించుకుని చక్రం తిప్పారు. ఉన్నతాధికారులను లెక్కచేయకుండా అధికార జులుం ప్రదర్శించారన్న ఆరోపణలు ఉన్నాయి. విజయసాయి రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాలకు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్నపుడు ఆయన అండతో దేవదాయశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారితో కలిసి పెద్దఎత్తున భూ కుంభకోణాలకు పాల్పడినట్టు ఈ అధికారిణిపై ఆరోపణలు ఉన్నాయి. విధులు సరిగా నిర్వహించమన్నందుకు ఏకంగా తన పైఅధికారిపై ఆరోపణలు చేసి, కార్యాలయంలోనే ఆయనపై ఇసుకు చల్లిన ఘనత ఈమె సొంతం. ఈ వ్యవహారంలో సదరు అధికారి ఏకంగా ఉద్యోగం వదిలేసి వెళ్లిపోయారు. కార్యాలయంలో ఉన్నతాధికారిపై అవిధేయత చూపినందుకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

అడ్డగోలుగా చేసేశారు..

సదరు అధికారిణి విజయసాయి అండతో అడ్డగోలుగా వ్యవహరించారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఆదేశాలు ఇచ్చారు. వన్‌టౌన్ సామారంగం చౌక్‌లో 1916లో చల్లంరాజు వెంకట శేషయ్య ధర్మసత్రాన్ని నిర్మించారు. దాత ఆశయాల మేరకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బాటసారులకు ఆ భవనంలో వసతులు కల్పించి హిందూ ప్రచారానికి వినియోగించాలి. సత్రం నిర్వహణకు ఉపయోగపడేలా 11 షాపులను నిర్మించి, వాటి అద్దెను వాడుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం దేవదాయశాఖ ఆధీనంలో ఈ సత్రం ఉంది. ఈ క్రమంలో 2023లో మొత్తం 11 షాపులకు వేలంపాట నిర్వహించారు. వీటిలో రెండు షాపులకు దేవదాయశాఖ నిబంధనలకు విరుద్ధంగా జీవో నెంబర్ 426 అమలు చేయకుండా 11 ఏళ్లకు లీజుకి ఇచ్చేశారు. నిబంధనల ప్రకారం ఏ షాపునైనా వేలం నిర్వహించి కేవలం 3 ఏళ్ల కాలానికే లీజుకు ఇస్తారు. ఈ వ్యవహారంలో ఈ అధికారిణి, దేవదాయశాఖ కమిషనరేట్‌లో మరో కీలక అధికారి కుమ్మక్కయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో సుమారు కోటి రూపాయలు చేతులు మారినట్లు దేవదాయశాఖ అధికారులే బహిరంగంగా ఆరోపించారు. దీనిపై వన్‌టౌన్‌కు చెందిన పలువురు వ్యాపారులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా, రాజకీయ ఒత్తిళ్లతో దాన్ని పక్కనపడేసినట్లు తెలుస్తోంది. ఆలయాలు, చారిటబుల్ ట్రస్ట్‌లలో తనిఖీలకు వెళితే వాటి స్థాయిని బట్టి ముడుపులు వసూలు చేస్తారన్న ఆరోపణలు ఈ అధికారిణిపై ఉన్నాయి. వివాదాస్పద, లీజుకు సంబంధించిన దేవదాయశాఖ భూముల విషయంలో ఎన్‌వోసీ ఇవ్వాలంటూ రూ.లక్ష సమర్పించుకోవాలని, తనిఖీల సమయంలో రూ.అరలక్ష నగదు, కనీసం పదివేల రూపాయల విలువగల పట్టుచీర సమర్పించాల్సిందేనని ఆ శాఖలోనే ఉద్యోగులే బహిరంగంగా చెబుతుంటారు.

విధేయత మార్చేశారు..

వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం రావడంతో ఈ అధికారిణి తన విధేయతను కూడా మార్చేశారు. ఏ రకంగానైనా సరే ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే తనకు విధులు కేటాయింప చేసుకునేందుకు ఆమె అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, శ్రీరాం తాతయ్యను కలిశారు. కృష్ణాజిల్లా బాధ్యతలతోపాటు ఎన్టీఆర్ జిల్లా అదనపు బాధ్యతల్లోనే తనను కొనసాగించాలని వారికి విన్నవించుకున్నట్లు సమాచారం. ఒకవేళ ఆయా స్థానాల్లో కొనసాగించడం కుదరకపోతే రెండు జిల్లాల్లోనే ఒక్కడో ఒకచోట తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్టు చెబుతున్నారు. ప్రసిద్ధ మోపిదేవి దేవస్థానం ఈవో కానీ తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా కానీ నియమించాలని కోరుతున్నట్లు సమాచారం.



గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరిగిన సీఎం ప్రమాణస్వీకార సభాప్రాంగణం వద్ద కొంతమంది సెల్‌ఫోన్లు మాత్రమే పనిచేశాయి. సీఎంకు జడ్‌ప్లస్ కేటగిరీ ఉండడంతో జామర్లు ఆన్‌చేయడంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ రావడం లేదని కొంతమంది భావించారు. కొంతమంది సెల్‌ఫోన్లు మాత్రం మోగాయి. దీనికి ప్రధాన కారణం బీఎస్‌ఎన్‌ఎల్ తీసుకొచ్చిన 'కౌ'.

కామధేనువు

బీఎస్ఎన్ఎల్ వద్ద 'కౌ'

- సిగ్నల్స్ పునరుద్ధరణకు మొబైల్ టవర్లు
- రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఏర్పాటు
- ఇటీవల సీఎం ప్రమాణస్వీకార సభ వద్ద కౌ సేవలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : మొబైల్ రంగంలో తన ప్రత్యేకతను చూపించుకోవడానికి కొత్త ఆవిష్కరణలకు బీఎస్ఎన్ఎల్ శ్రీకారం చుట్టింది. ప్రముఖుల సభలు జరిగినప్పుడు, జనం రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ కౌను ప్రయోగిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న కూటమి సభల్లో కౌ లక్షలాదికి మందికి సిగ్నల్స్‌ను అందజేసింది. దీనితో మొబైల్ రంగంలో అసలు ఈ బీఎస్ఎన్ఎల్ రూపొందించిన కౌ ఏమిటన్న దానిపై చర్చ జరుగుతోంది.

అసలు కౌ అంటే...

సెల్‌ఫోన్లకు సిగ్నల్స్‌ను ప్రసారం చేయడానికి బీఎస్ఎన్ఎల్ రూపొందించిన కొత్త టెక్నాలజీ పేరు కౌ. సెల్ ఆన్ వీల్స్ పేరుతో మినీ టవర్లను రూపొందించింది. దీన్ని సంక్షిప్తంగా కౌ అని వ్యవహరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదొక మొబైల్ టవర్. సెల్‌ఫోన్ నుంచి కాల్ మరొకరికి వెళ్లాలన్నా, ఇతరుల నుంచి మనకు రావాలన్నా అందుకు అవసరమైన సిగ్నల్స్ టవర్ నుంచి విడుదలవుతాయి. ఈ సిగ్నల్స్ కోసం బీఎస్ఎన్ఎల్‌తోపాటు అన్ని సర్వీసు ప్రొవైడర్లు పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో పలు ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేశాయి. ఈ టవర్లు స్థిరంగా ఉండిపోతాయి. నగర నడిబొడ్డున ఉన్నా సిగ్నల్స్ సరిగా ఉండడం లేదని అనేక మంది సెల్‌ఫోన్ వినియోగదారులు నిత్యం గగ్గోలు పెడుతున్నారు. సిగ్నల్స్ విషయంలో అన్ని సర్వీసు ప్రొవైడర్ల పరిస్థితి ఒకేలా ఉందని విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అప్పటి వరకు ఫోన్ మాట్లాడుతున్నా కాసేపటికి కాల్ కట్ అయిపోతుంది. కొన్నిసార్లు నంబర్‌ను డయల్ చేసినప్పుడు ఫోన్ స్క్రీన్‌పై కాలింగ్ అని చూపిస్తుంది. ఎంతసేపు అయినా కాల్ మాత్రం కనెక్ట్ అవ్వదు. దీనికి ప్రధాన

- మిగతా 4లో



అమ్మవారి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశాంత్ మిశ్రా దంపతులు ఆదివారం ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఈవో కేఎస్ రామారావు, సిబ్బంది ఆలయ మర్యాదల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం ఇచ్చి సత్కరించారు.

- వన్‌టౌన్

సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు



ఎస్ఆర్ఆర్ కాలేజీ వద్ద పరీక్షకు వెళుతున్న అభ్యర్థులు

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) నేతృత్వంలో నగరంలో ఆదివారం సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు సజావుగా జరిగాయి. 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. - విజయవాడ



ఎరువు.. ఏకరువు

సూక్ష్మ పోషక ఎరువుల కోసం కొత్త ప్రభుత్వానికి రైతుల వేడుకోలు

- నాలుగేళ్లుగా సబ్సిడీపై ఎరువులు అందక అవస్థలు
- గతంలో టీడీపీ హయాంలో ఉచితంగా ఇచ్చేవారని విజ్ఞప్తి

వ్యవసాయంలో అధిక దిగుబడులు తెచ్చిపెట్టే కాంప్లెక్స్ ఎరువులతో పాటు సూక్ష్మ పోషక ఎరువుల పంపిణీకి పూర్వవైభవం తేవాలని రైతులు కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఎరువులను ఉచితంగా అందించేవారని, వైసీపీ వచ్చాక ఆ అంశాన్ని పక్కనపెట్టేసిందని, ఎరువుల కోసం ఇన్నాళ్లూ అష్టకష్టాలు పడ్డామని, టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టిన నేపథ్యంలో గతంలో మాదిరిగా తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వరి, పసుపు, ఉద్యాన పంటల్లో ఆశించిన మేర దిగుబడులు సాధించాలంటే ఎరువుల వినియోగం తప్పనిసరి. కాంప్లెక్స్ ఎరువులతో పాటు సూక్ష్మ పోషక ఎరువులను కూడా వాడితే దిగుబడులు పెరుగుతాయి. ఇంతగా ఉపయోగం ఉన్న సూక్ష్మపోషక ఎరువులను రైతులకు సబ్సిడీపై అందించకుండా గత ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభమైంది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఈ ఏడాదైనా సూక్ష్మపోషక ఎరువులను ఉచితంగా ఇస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గతంలో టీడీపీ ప్రభుత్వంలో..

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏటా భూసార పరీక్షలు నిర్వహించేవారు. రైతులకు భూసారాన్ని తెలియజేసేలా సాయిల్ హెల్త్‌కార్డులను అందించేవారు. భూమిలో సారం ఎంత ఉంది, ఏ రకం ఎరువులు వాడాలి, ఏ రకం ఎరువులు తగ్గించాలి అనే అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా రైతులకు తెలియజేసేవారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు జిప్సం, బోరాన్, జింక్ సల్ఫేట్ వంటి సూక్ష్మపోషక ఎరువులను ఉచితంగా అందజేసేవారు. ఫలితంగా రైతులు అధిక దిగుబడులు సాధించేవారు. 2015-2018 వరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో 5,25,364 భూసార పరీక్షలు నిర్వహించారు. 2019లోనూ 56 వేలకు పైగా పరీక్షలు చేశారు. పొలంబడి కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో జింక్ సల్ఫేట్, బోరాన్, చౌడు భూములున్న ప్రాంతాల్లో జిప్సం వంటివి ఉచితంగా ఇచ్చేవారు. గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఏడాదికి జింక్ సల్ఫేట్ భూమిలో వేసేందుకు 450 టన్నులు, పైపాటుగా పిచికారీ చేసేందుకు 16 టన్నులు ఉచితంగా ఇచ్చేవారు. బోరాన్ 17 టన్నులు, జిప్సం 1,650 టన్నులు రైతులకు ఇచ్చేవారు. రైతుల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఉచితంగానే అందించేవారు. ఇందుకు ఏటా కనీసం రూ.3 కోట్లకు తగ్గకుండా ఖర్చయ్యేది.

వైసీపీ వచ్చాక..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూక్ష్మపోషక ఎరువులను రైతులకు ఉచితంగా ఇచ్చే కార్యక్రమాన్ని నిలిపివేసింది. టన్ను జింక్ సల్ఫేట్ ధర సుమారు రూ.55 వేలు, జిప్సం రూ.40 వేలు, బోరాన్ రూ.లక్ష పలుకుతోందని ఉచితంగా ఇవ్వడం మానేసింది.

కొత్త ప్రభుత్వం పట్టించుకోవాలి

ప్రస్తుతం ఏ రకం పంటలు సాగుచేసినా ఎరువుల వినియోగం తప్పనిసరి. కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. డీఏపీ, 20-20-0, 17-17-17, మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 28-28, 34-14 వంటి ఎరువులు 50 కిలోల బస్తా రూ.1,900 కంటే అధికంగానే ఉంది. ఈ ఎరువులతో పాటు సూక్ష్మపోషక ఎరువులను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భూముల రకాలను బట్టి మోతాదు ప్రకారం వాడితే అధిక దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. ప్రైవేటుగా సూక్ష్మపోషక ఎరువులను కొనాలంటే వ్యాపారులు నిర్ణయించిన ధరను అనుసరించాలి. జింక్, బోరాన్, జిప్సం ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే.. ఆర్బీకేలకు వెళ్లి నగదు చెల్లించాలని, అందుకు అనుగుణంగా ఇండెంట్ పెట్టి ఎరువులను రప్పిస్తామని చెబుతున్నారు. అలాకాకుండా కొత్త ప్రభుత్వం కలగజేసుకుని ఈ సీజన్ నుంచే సూక్ష్మపోషక ఎరువులను ఉచితంగా ఇవ్వాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

మునిసిపల్ కార్పొరేషన్‌లో అవినీతి కంపు

శానిటరీ విభాగంలో ఉద్యోగుల విచ్చలవిడి అవినీతి

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ శానిటరీ విభాగంలో అవినీతి కంపు కొడుతోంది. శానిటరీ విభాగంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు ప్రతిపనికీ ఒక రేటు నిర్ణయించి నగదు వసూళ్లకు పాల్పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ల హోదాలో పనిచేస్తున్న వీరు, వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ పెద్దల సహకారంతో అనధికారికంగా శానిటరీ అధికారులుగా చలామణీ అవుతూ వచ్చారు. కొంతకాలంగా వీరు తమదైన శైలిలో తెరవెనుక చక్రం తిప్పుతూ వస్తున్నారు. వీరి ఆగడాలు అధికం కావడంతో పనితీరు మార్చుకోమని చెప్పిన ఒక పై అధికారి ఇంటికి అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెళ్లి సదరు అధికారిని, ఆయన కుటుంబసభ్యులను బెదిరించారు. ఈ ఘటనతో కొద్ది రోజులపాటు సంబంధిత ఉద్యోగిని పక్కనపెట్టిన అధికారులు మళ్లీ అదేపోస్టును అతనికి కేటాయించడం గమనించ దగ్గ అంశం.

- ఆ ఇద్దరు ఉద్యోగులు చెప్పినట్టే నడుస్తున్న పరిపాలన
- విధులకు హాజరుకాని కార్మికుల మస్తర్లలోనూ చేతివాటం
- డీజిల్ పేరుతో లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్న వైనం
- పదోన్నతి ఇచ్చిన ఉద్యోగులకు వేతనాలు పెంచకుండా ఆరు నెలలుగా జాప్యం



మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ శానిటరీ విభాగంలో 450 మందికిపైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్‌లలో కార్మికుల విధులకు సంబంధించి హాజరును సచివాలయాల్లో పనిచేసే శానిటరీ విభాగం సెక్రటరీలు ప్రతినెలా తయారు చేసి మునిసిపల్ కార్యాలయానికి పంపుతారు. వీటి ఆధారంగా కార్మికులకు జీతాల చెల్లింపు చేసే పనిని ఈ ఇద్దరు అసిస్టెంట్ శానిటరీ ఇనస్పెక్టర్లు చేస్తుంటారు. కార్మికులు వివిధ కారణాలతో విధులకు హాజరుకాకున్నా హాజరైనట్లుగా చూపి పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించడంలో ఈ ఇద్దరు ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా తమపని చేసుకుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్మికులు నెలలో పదిరోజుల పాటు విధులకు హాజరుకాకున్నా హాజరైనట్లుగా చూపుతామని, ఈ పది రోజుల జీతంలో ఐదురోజుల జీతాన్ని మాకు ఇవ్వాలని ఇద్దరు అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్మికుల నుంచి బేరం కుదుర్చుకుని వసూలు చేసుకుంటున్నారని, ఈ అంశం బహిరంగ రహస్యమని కార్యాలయ ఉద్యోగుల బాహాటంగానే చెప్పుకుంటున్నారు. 450 మందికిపైగా కార్మికుల జీతాల చెల్లింపులో తిమ్మినిబమ్మిని చేసి ఈ తరహాలో కనీసంగా నెలకు రెండు లక్షల రూపాయలను వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇంతా జరుగుతున్నా కార్యాలయ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించడంలేదని, దీంతో ప్రజాధనం పక్కదారి పడుతోందని కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు అంటున్నారు.

డీజిల్ వినియోగంలోనూ ఇదే తంతు

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా చెత్తసేకరణ కోసం ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ వాహనాలకు వాటి సామర్థ్యానికి అనుగుణంగా రోజుకు 10 నుంచి 15 లీటర్ల డీజిల్ కూపన్లను శానిటరీ విభాగం నుంచి ఇస్తారు. కానీ బంకుల్లో ఏడు లేదా ఎనిమిది లీటర్ల డీజిల్ మాత్రమే కొడుతున్నారని, మిగిలిన డీజిల్‌ను రోజుకు ఎన్ని వాహనాలకు కూపన్లు ఇస్తే ఆ లెక్కన డీజిల్ సొమ్మును పెట్రోల్ బంకుల నుంచి ఈ ఇద్దరు అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వసూలు చేసుకుని ఎవరి వాటాలు వారికి ఇస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరులోనూ నగదు వసూళ్లకు పాల్పడటం గమనార్హం. గత 14 సంవత్సరాలుగా వీరు ఈ సీట్లను వదలకుండా తిష్టవేసి పనిచేయడం వీరికే చెల్లుబాటు అవుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో గతేడాది చెత్తసేకరణకు సంబంధించిన ఐషర్ వాహనంతో పాటు, రెండు ట్రాక్టర్లు మాయమయ్యాయి. వీటిని మాయం చేసిన ఘటనపై విచారణను పక్కనపెట్టేశారు. ఈ వ్యవహారంలో బాధ్యుడైన అధికారికి ఇటీవల పదోన్నతి ఇచ్చి మరీ కార్యాలయంలో పనిచేయించుకోవడం గమనించదగ్గ అంశం. శానిటరీ విభాగంలో ఉపయోగించే వాహనాలకు చిన్నపాటి మరమ్మతులు చేసినా వెయ్యి రూపాయలు ఖర్చయ్యే పనులకు ఐదువేల రూపాయల వరకు బిల్లులు పెట్టడం గమనించదగ్గ అంశం.

పదోన్నతి ఇచ్చినా సీట్లు కేటాయించరు?

ఈ ఏడాది జనవరి నెలలో మునిసిపల్ కార్పొరేషన్ శానిటరీ విభాగంలో పనిచేసే ఐదుగురు ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చారు. వీరికి గత ఐదునెలలుగా పదోన్నతికి అనుగుణంగా సీట్ల కేటాయించలేదు. పదోన్నతులు ఇచ్చిన ఉద్యోగులకు సీట్లు కేటాయిస్తే తమ అక్రమ రాబడికి గండిపడుతుందనే కారణంతో అధికారులను అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పక్కదారి పట్టించి ఏవేవో కారణాలు చూపి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పదోన్నతి ద్వారా పెరిగే జీతాన్ని కలపకుండా గత ఐదునెలలుగా వీరు తెరవెనుక చక్రం తిప్పుతుండటంతో సదరు ఉద్యోగులు పై అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కౌంటింగ్ సందర్భంగా కృష్ణా యూనివర్సిటీలో పారిశుధ్య పనులను మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించారు. అక్కడ పారిశుధ్య చర్యల నిమిత్తం బిల్లులు చేసి పెద్దమొత్తంలో నగదు మిగుల్చుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

గోమాతలకు విముక్తి..

» 200 గోవులను విడిపించిన వీహెచ్‌పీ సభ్యులు

బక్రీద్ సందర్భంగా బలి ఇవ్వడానికి నిర్బంధించిన సుమారు 200కు పైగా గోవులను ఆదివారం విశ్వ హిందూ పరిషత్ సభ్యులు విడిపించారు. గొల్లపూడి అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు చివర టర్నింగ్ వద్ద ఈ గోవులను నిర్బంధించారు. సమాచారం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ గోరక్ష కార్యకర్తలు వాటిని విడిపించారు. - విద్యాధరపురం





ప్రపంచ స్కేటింగ్‌లో మెరిసిన తెలుగుతేజం

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 16 : న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియానిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో విజయవాడ స్కేటింగ్ క్రీడాకారిణి, తెలుగు తేజం మాత్రపు జెస్సీరాజ్ స్వర్ణంతో మెరిసింది. 13 ఏళ్ల వయస్సులోనే దేశంలో నెంబర్-1 స్కేటర్‌గా పేరొందిన జెస్సీరాజ్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. పసిఫిక్ కప్ ఆర్టిస్టిక్ ఓపెన్ ఇన్విటేషనల్ కాంపిటేషన్ పేరుతో ఈ పోటీలను నిర్వహించగా, రెండు రౌండ్లలో జెస్సీరాజ్ 31.98 పాయింట్లతో బంగారు పతకాన్ని వశం చేసుకుంది. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా, ఐర్లాండ్, జపాన్, న్యూజిలాండ్ దేశాల క్రీడాకారులు బరిలో దిగారు. విజయవాడ ఎస్ఎస్ఎం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న జెస్సీరాజ్ పతకం సాధించడంపై ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి థామస్ చౌదరి, కోచ్ సింహాద్రిలు అభినందించారు.



స్వర్ణం సాధించిన రోలర్ స్కేటర్ జెస్సీరాజ్



ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

» దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

» ఆదివారం ఆదాయం రూ.54.09 లక్షలు

వన్‌టౌన్, జూన్ 16 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సందర్భంగా దుర్గమ్మ ఆలయం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈవో కేఎస్ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది భక్తులు ఒత్తిడికి గురికాకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులకు సమాచారమందించడంలో వేగం, నాణ్యత ఉండాలని సూచించారు.

ఆదివారంసాయంత్రం 6.30 గంటల వరకు అమ్మవారికి వచ్చిన ఆదాయ వివరాలను దేవస్థానం ప్రకటించింది. రూ.33.50 లక్షలు దర్శనం టికెట్ల ద్వారా, మొత్తంగా రూ.54,09,493లు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. రూ.500 టికెట్ రుసుం ద్వారా 3236 మంది భక్తులు దర్శించుకోగా రూ.16,18,000, రూ.300 టికెట్ ద్వారా 2755మంది దర్శించుకోగా రూ.8,26,500లు, రూ.100 టికెట్ ద్వారా 9013 మంది దర్శించుకోగా రూ.9,01,300 ఆదాయం సమకూరింది. 4936 మంది భక్తులు తలనీలాలను సమర్పించారు. 68,749 లడ్డూ ప్రసాదాన్ని విక్రయించగా 29,853 పులిహోర ప్రసాదాలను విక్రయించారు. విరాళాల ద్వారా రూ.2,07,780 ఆదాయం సమకూరింది. శనివారం మొత్తంగా రూ.33,39,481 రూపాయలు, శుక్రవారం నాడు 39,74,194 రూపాయలు ఆదాయం సమకూరింది.



దుర్గమ్మను దర్శించుకున్న పి.నారాయణ దంపతులు, మంత్రి సత్యకుమార్

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

దుర్గమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, రాష్ట్ర మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరికి ఈవో కేఎస్ రామారావు, సిబ్బంది ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనంచేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

అమ్మవారికి 59 గ్రాముల బంగారు హారం కానుక..



ముంబాయికి చెందిన అహిల్యా వసంతరావు పాటిల్ ఆయన కుటుంబసభ్యులు ఆదివారం ఆలయానికి విచ్చేసి దుర్గమ్మ వారి అలంకరణ నిమిత్తం 59 గ్రాముల బంగారు హారాన్ని అందజేశారు.

ధర్మపదం వేదికపై ఆదివారం తెనాలికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్యకళాకేంద్రం వారిచే కూచిపూడి నృత్యాభినయనం కన్నుల విందుగా సాగింది. ఎ.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కళాకారుల బృందం కీర్తనలకు చక్కని అభినయం చేసి అహూతులను అలరించారు.



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు కరికల్ వలవెన్‌కు అందజేస్తున్న ఈవో

సుబ్బారాయుడిని దర్శించుకున్న రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ

మోపిదేవి, జూన్ 16 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ అండ్ ఎండోమెంట్) ఆర్.కరికల్ వలవెన్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. తొలుత నాగ పుట్ట వద్ద పాలు పోసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు నల్లం సూర్యచక్రధరరావు వారిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

గులాబీల అలంకరణలో తిరుపతమ్మ అమ్మవారు



పెనుగంచిప్రోలు, జూన్ 16 : తిరుపతమ్మ ఆలయం ఆదివారం తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పోటెత్తింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆలయ పరిసరాలతో పాటు మునేటి అవతల వైపున గల మామిడి తోటలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మునేటి కాసులపై భక్తుల వాహనాలతో నిండిపోయింది. దీంతో ఎస్‌ఐ పి.రాంబాబు స్వయంగా సిబ్బందితో పోలీస్ స్టేషన్ సెంటర్ మునేటి అవతల వైపున ప్రత్యేక బందోబస్తు నిర్వహించి ప్రయాణీకులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. గులాబీ పూలతో ప్రధాన అర్చకుడు మరేబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుందరంగా అలంకరణ చేశారు. గులాబీల అలంకరణలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సెంట్రల్ జోన్ వన్డే చాంప్ ప్రకాశం

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 16 : మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ పురుషుల అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌ల్లో ప్రకాశం జిల్లా టీమ్ మెరుగైన రన్‌రేట్‌తో చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం గుంటూరు-కృష్ణా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత కృష్ణా జట్టు 50 ఓవర్లలో 291/9 పరుగులు చేసింది. వీవీ దుర్గారావు(78) ఖాజా మొహిద్దీన్(67) అర్ధసెంచరీలతో రాణించారు. అనంతరం గుంటూరు జట్టు 46.5 ఓవర్లలో 265 పరుగులకు కుప్పకూలింది. దీంతో మూడు జట్లు మూడేసి మ్యాచ్‌లు ఆడి రెండేసి విజయాలతో ఎనిమిది పాయింట్లతో నిలవగా మెరుగైన రన్‌రేట్(1.86)తో ప్రకాశం చాంపియన్ నిలవగా, గుంటూరు (0.85)రెండోస్థానంలోను, కృష్ణా(0.37) మూడో స్థానంలో నిలిచాయి.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా..

» అభయాంజనేయుడి సేవలో మంత్రి పార్థసారథి



జంక్షన్‌లో అభయాంజనేయస్వామిని దర్శించిన మంత్రి పార్థసారథి

హనుమాన్‌జంక్షన్, జూన్ 16 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషి చేస్తామని గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆదివారం నూజివీడు వెళుతూ మార్గమధ్యలో జంక్షన్‌లోని అభయాంజనేయ ఆలయాన్ని సందర్శించారు. అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు ఆలయ మర్యాదలతో స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజల ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తామన్నారు. మంత్రికి బాపులపాడు, నూజివీడు, పెదపాడు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.

చంద్రబాబును కలిసిన కొనకళ్ల



మచిలీపట్నం టౌన్ : కూటమి ప్రభుత్వం తాజా రాజకీయ పరిస్థితులపై సీఎం చంద్రబాబుతో కలిసి చర్చించినట్టు మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. ఆదివారం చంద్రబాబును కొనకళ్ల మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నూతన ప్రభుత్వంపై ప్రజల మనోభావాలు అడిగారన్నారు. కృష్ణాజిల్లా పరిధిలోని ఏడు నియోజక వర్గాలు గెలుపొందడం పట్ల చంద్రబాబు సంతోషం వ్యక్తం చేసారన్నారు. కొనకళ్ల బుల్లయ్య తదితరులు చంద్రబాబును కలిసారు.

దేవినేని ఉమాను కలిసిన మంత్రులు



గొల్లపూడి : మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును గొల్లపూడిలోని ఆయన నివాసంలో ఆదివారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, బీసీ సంక్షేమం, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్‌శాఖ మంత్రి ఎస్.సవితలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రైతు సమస్యలపై దృష్టి సారించాలి

» మంత్రి అచ్చెన్నాయుడికి గోపు సత్యనారాయణ వినతి



మచిలీపట్నం టౌన్, జూన్ 16 : వైసీపీ పాలనలో అన్నదాతలు ఎన్నో అవస్థలు పడ్డారని, రైతుల సమస్యలపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని కలిసి టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ విన్నవించారు. ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి రైతు సమస్యలపై చర్చించారు. చంద్రబాబు అధికారంలోకి రావడంతో రైతులు సంతోషంతో ఉన్నారన్నారు. రైతులకు సబ్సిడీపై వరి వంగడాలు, ఖరీఫ్ రుణాలు సకాలంలో అందించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం సబ్సిడీలను దిగమింగిన వైసీపీ

» ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు

గుణదల, జూన్ 16 : ఉమ్మడి కృష్ణా జిల్లా మెట్ట ప్రాంతంలో వేలాది ఎకరాల్లో పామాయిల్ సాగు చేసిన రైతులకు కేంద్రం ఇచ్చిన సబ్సిడీలను సైతం వైసీపీ మింగేసిందని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు ఆరోపించారు. కరెన్సీనగర్లోని వ్యవసాయశాక క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడును రైతు సంఘాల నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు వైసీపీ ప్రభుత్వం డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్‌కు కేంద్రం రైతులకు ఇచ్చిన సబ్సిడీలను కూడా దిగమింగేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఆ తప్పిదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటి మాజీ ఛైర్మన్ మైనేని మురళీకృష్ణ, నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటి మాజీ ఛైర్మన్ ఎనమద్ది పుల్లయ్య చౌదరి తదితరులు అచ్చెన్నాయుడును కలిసి పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు.

రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిద్దాం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : కూటమి అభ్యర్థులు సమన్వయతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.రవీంద్ర ఇంటి వద్ద ఆదివారం విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరి కలిశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీల నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కావలసిన నిధులు తీసుకురావడంలో ఎంపీ బాలశౌరి సహాయ సహకారాలు అందుతాయన్నారు. చంద్రబాబు హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. అమరావతికి పూర్వవైభవం తెస్తామన్నారు.



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం

- ఎస్టీయూ

గుడివాడ, జూన్ 16 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాఠశాలల్లో అనేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, నూతన ప్రభుత్వం విద్యారంగాన్ని గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతో ఉందని, దీనికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని ఎస్టీయూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ ప్రకటించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వలన ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. సదరు జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యారంగాన్ని చక్కదిద్దుతానని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులకు 2011 పీఆర్సీలో ఉన్న లక్షలాది రూపాయల బకాయిలు, ఐదేళ్లలో పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, శెలవు బకాయిలు విషయమై నూతన ప్రభుత్వం సానుకూల దృష్టితో పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరించిందని, తమ పోరాటాలు, ఉద్యమాలు కేవలం సమస్యల పరిష్కారానికేనని, విధానపరమైన నిర్ణయాలపై మాత్రమే ఉంటుందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలను వెంటనే ఇద్దరు ఉపాధ్యాయుల ఉండే విధంగా ఏర్పాటు చేయాలని, బోధనారంగంలో తీవ్ర ఒత్తిడి కలుగజేస్తున్న యాప్‌లను తగ్గించాలని, బోధనేతర పనులను తొలగించాలని, ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.ఇమ్మానియేల్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాతయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి మాధవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజశేఖర్, ఎ.ఎస్.వి ప్రసాద్, మూర్తి, పలు మండలాల అధ్యక్షకార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల జీవితానికి భరోసా కల్పిద్దాం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ధర్నాచౌక్ ,జూన్ 16: వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యానికి, ఆర్థిక భద్రతకు సమాజంలోని ప్రతీ ఒక్కరూ కలిసి పని చేయల్సిన అవశ్యత ఉందని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. ప్రభుత్వాలు,స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వారి గౌరవప్రదమైన జీవితానికి భరోసా కల్పిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ అవగాహన దినోత్సవ కార్యక్రమం గాంధీనగర్‌లోని ప్రముఖ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమ చట్టం- 2007, వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకోనేలా చూడాలన్నారు. వేధింపులకు సంబంధించి ఫిర్యాలుపై డివిజన్ స్థాయిలో సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. వృద్ధులపై వేధింపుల ఘటనలు చోటుచేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులకు అడ్డుకట్ట వేయాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మెరుగైన సమాజం నిర్మితమవుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వుల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరు బాబూరావు, కార్యదర్శి. మోతుకూరి వెంకటేశ్వరరావు, హెల్పేజ్ ఇండియా ప్రతినిధి లంకపల్లి మృణాల్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.చంద్రమౌళి, వయోవృద్ధు సంక్షేమ శాఖ ఏడీ.వి.కామరాజు, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి, డాక్టర్ సీఎల్ వెంకటరావు, సీవీ.బాబు, ప్రజా కళాకారులు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



వేదాద్రి నరసింహస్వామికి మొక్కుబడుల చెల్లింపు

జగ్గయ్యపేట, జూన్ 16 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని నడిచి వెళ్లి దర్శించుకుంటానని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సతీమణి శ్రీదేవి మొక్కును ఆదివారం చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఆమె పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. కాలినడకన వేదాద్రి చేరుకున్నారు. ఆమెకు సంఘీభావంగా కిట్టు, సిద్దూ పలువురు టీడీపీ మహిళా నేతలు, కౌన్సిలర్లు యాత్రలో పాల్గొన్నారు. వేదాద్రిలో యోగానంద లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, జూన్ 16 : గురుపౌర్ణమి పురస్కరించుకుని జూలై 14న గురువులకు వందనం పేరుతో నిర్వహించే గురుబ్రహ్మ, గురు శిరోమణి పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ సర్వేజనా సుఖినో భవంతు (హైదరాబాద్) వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, నాటక రంగం, టీవీ, సినీ రంగాలలో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులైన గురువులకు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న గురువులు ఈనెల 25వ తేదీలోపు తమ ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలను దరఖాస్తుకు జతచేసి కార్యాలయానికి పంపాలని కోరారు. వివరాలకు 96523 47207 నెంబరులో సంప్రదించాలని కోరారు.

దీక్ష విరమించిన దండమూడి

» జగన్ పాలనకు నిరసనగా నల్లచొక్కా

» 2023 నుంచి నల్లచొక్కాతోనే దండమూడి



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) వైఎస్ జగన్ రెడ్డి టీడీపీ శ్రేణులపై సాగిస్తున్న దమనకాండను నిరసిస్తూ నల్లచొక్కా ధరించిన కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి ఎట్టకేలకు దీక్ష విరమించారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పసుపు చొక్కా తీసుకుని ధరించి తన నిరసనను విరమించారు. వైసీపీ పాలనను నిరసిస్తూ 2023 జనవరిలో దండమూరి నల్లచొక్కా ధరించి దీక్షను ప్రారంభించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ సర్కారు కూలిపోయి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత దండమూడి తన నల్లచొక్కా దీక్షకు స్వస్తి పలికారు. శనివారం సీఎం చంద్రబాబును కలిసి ఆయన చేతుల మీదుగా పసుపు చొక్కా స్వీకరించి ధరించారు.

సిగ్నల్స్ కామధేనువు

(3వ పేజీ తరువాయి)

సమస్య సిగ్నల్స్ లేకపోవడమేనని సెల్ యూజర్లకు తెలిసిన విషయమే

సిగ్నల్స్ జాం

నగరంలో రహదారులపై ట్రాఫిక్ స్తంభించిపోయినట్టే సెల్‌టవర్ల నుంచి వెలువడే సిగ్నల్స్ స్తంభించిపోతాయి. దీనికి ప్రధాన కారణం ఎక్కువ మంది ఒకేచోట ఉండడమేనని బీఎస్ఎన్ఎల్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమస్యలు ఎక్కువగా జాతరలు జరిగినప్పుడు, బహిరంగ సభలు నిర్వహించినప్పుడు, ట్రాఫిక్‌లో వాహనాలను ఎక్కువ సమయం ఆగినప్పుడు వస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఒక్కో సెల్‌టవర్ సామర్థ్యం (బ్యాండ్ విడ్త్) 100 ఎంబీ ఉంటుంది. ఈ సామర్థ్యం ఉన్న టవర్ 10వేల సెల్‌ఫోన్లకు సిగ్నల్స్‌ను ప్రసారం చేస్తుంది. దీనికి మించిన సెల్‌ఫోన్లు ఆ ప్రాంతంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ జామ్ అవుతాయి. దీనితో కొంతమందికి సిగ్నల్స్ అందవు. మరికొంతమంది సిగ్నల్స్ అందినా కాల్‌బ్రేక్‌లు అవుతాయి. ప్రముఖుల సభల్లో ఎక్కువగా ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతుండడంతో బీఎస్ఎన్ఎల్ కౌను తీసుకొచ్చింది. ఇదొక మొబైల్ టవర్. ఇది జనరేటర్ మాదిరిగా ఉంటుంది. ఈ వాహనంపై విద్యుత్ సరఫరా చేసే క్యాబిన్ ఉంటుంది. టవర్ యాంటీనా విడిభాగాలుగా ఉంటుంది. అవసరమైనచోటకు ఈ వాహనాన్ని తీసుకెళ్లి యాంటీనాను బిగిస్తారు. ఈ యాంటీనా ఎత్తు ఆరు నుంచి ఏడు అడుగుల వరకు ఉంటుంది. ఇటువంటి కౌలు బీఎస్ఎన్ఎల్ వద్ద తిరుపతి, నెల్లూరు, విశాఖపట్నంలో ఉన్నాయి. ఎన్నికల ప్రచారంలో రాయలసీమలో కూటమి నిర్వహించిన సభల్లో ప్రధాని మోదీ పాల్గొన్నప్పుడు ఈ కౌ సేవలను వినియోగించారు. ఇటీవల జరిగిన చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తిరుపతిలో ఉన్న కౌను కేసరపల్లికి తీసుకొచ్చారు.



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రాష్ట్రాభివృద్ధిలో సంపూర్ణ సహకారం

- ఉద్యోగుల సంఘం నేతలు

వన్‌టౌన్, జూన్ 16 : రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని ప్రభుత్వ నాలుగవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తోట చిన్నప్పలు స్పష్టం చేశారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మల్లేశ్వరరావు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్రప్రభుత్వానికి అభివృద్ధిలో పూర్తిగా సహకరిస్తామని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను వీలైనంత త్వరగా కొత్త ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉద్యోగుల పక్షాన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఈ.సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపఅధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, సహ అధ్యక్షుడు మద్దిలేటి, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రాళ్ల దాడి చేస్తున్న వ్యక్తిని వారిస్తున్న కానిస్టేబుల్

మాజీమంత్రి జోగి రమేశ్ ఇంటిపై రాళ్ల దాడి

ఇబ్రహీంపట్నం , జూన్ 16 : ఇబ్రహీంపట్నంలోని మాజీమంత్రి జోగి రమేశ్ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం కారులో వచ్చి రాళ్ల దాడి చేశారు. కారు దిగిన ఇద్దరు వ్యక్తులు ఇంటిపై రాళ్ల విసురుతూ మాజీమంత్రిని 'రారా.. బయటకు రా..' అంటూ అరిచారు. అక్కడున్న కానిస్టేబుల్ వారిని వారించారు. పట్టరాని కోపంతో ఉన్నవారు కానిస్టేబుల్‌పై కూడా తిరగబడే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో మాజీమంత్రి కానీ, ఆయన కుటుంబ సభ్యులు కానీ ఇంట్లో లేరు. కాగా, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

మంత్రి పార్థసారథికి సత్కారం

కంకిపాడు, జూన్ 16 : గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని జిల్లా తెలుగురైతు కార్యదర్శి మద్దాలి సాయిబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లపట్టాలు రాని వారికి ఇళ్లపట్టాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సారథిని కోరినట్లు ఆయన తెలియజేశారు.



మంత్రి పార్థసారథిని సత్కరిస్తున్న సాయిబాబు

నేలకొరుగుతున్న లైటింగ్ స్తంభాలు!

నాణ్యత ప్రమాణాలపై సర్వత్రా విమర్శలు

హనుమాన్‌జంక్షన్/ రూరల్, జూన్ 16 : కేంద్ర ప్రభుత్వ నిధులతో స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో నూతనంగా నిర్మిస్తున్న రహదారి సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ప్రారంభించకుండానే నేలకొరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జంక్షన్ బైపాస్ ఏర్పడిన నేపథ్యంలో నాలుగు ప్రధాన రోడ్లు డివైడర్లపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ మంజూరైంది. బైపాస్ ఏర్పడడంతో జంక్షన్ (ఏలూరు-విజయవాడ రోడ్డు) జాతీయ రహదారిని రూ.9 కోట్లుతో అభివృద్ధి చేశారు. అందులో భాగంగానే నాలుగు రోడ్లులో డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ కూడా నిర్మాణం చేపట్టారు. అన్ని రోడ్డులో పోల్స్ నిలబెట్టారు. ఏలూరురోడ్డు బొమ్ములూరు ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి విజయవాడ రోడ్డు వేలేరు అడ్డరోడ్డు సమీపంలోని రామాలయం వరకు డివైడర్‌పై లైటింగ్ పోల్స్ ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద భారీ సైజ్ హైమాస్ట్ పోల్స్ కూడా ఏర్పాటు చేశారు. నూజివీడు రోడ్డులో సెంటర్ నుంచి ఆరు పోల్స్ ఏర్పాటు చేశారు. ఇటీవలే వాటిని నిలబెట్టారు. నిలబెట్టిన కొద్ది రోజుల్లోనే స్తంభాలు పక్కకు ఒరిగిపోయి కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ మీద పడుతుందోనన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. లైటింగ్ పోల్స్ నాణ్యత ప్రమాణాలపై పెదవి విరుస్తున్నారు. చిరకాలంగా జంక్షన్ వాసులు సెంట్రల్ లైటింగ్ కల ప్రారంభించ కుండానే నేలకొరుగుతున్నాయి. ప్రతి రోజు వేలాది మంది ప్రయాణించే రహదారుల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ పనుల్లో నాణ్యతపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులను దగ్గరుండి పర్య వేక్షించాలని, పనులు చేసి వెళ్లిపోయిన తరువాత అధికారులే ప్రజలకు సమాధానం చెప్పాలి కాబట్టి ముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పక్కకు ఒరిగిన నూజివీడు రోడ్డులో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ స్తంభం

వైవీబీకి పాస్టర్ల అభినందన



వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను అభినందిస్తున్న పాస్టర్లు

ఉయ్యూరు, జూన్ 16 : రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ చర్చి పాస్టర్లు మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను ఆదివారం కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడటంతో ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి చంద్ర బాబును ముఖ్యమంత్రిని చేశారన్నారు. పాస్టర్ల సంఘం నాయకుడు రాజేశ్ తదితరులు పాల్గొని రాజేంద్ర ప్రసాద్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టండి: దేవినేని రాజా



అధికారులతో మాట్లాడుతున్న రాజా

ఈడుపుగల్లు (కంకిపాడు), జూన్ 16 : ఈడుపుగల్లు - ఉప్పలూరు ప్రధాన రహదారి అభివృద్ధికి తగు చర్యలు చేపట్టాలని వివిధ శాఖల అధికారులను మాజీ ఎంపీపీ దేవినేని రాజా కోరారు. అధ్వానంగా మారిన రహదారిని ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, ఈడుపుగల్లు - ఉప్పలూరు రహదారి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అదే విధంగా పునాదిపాడుపై ఓవర్ వద్ద రోడ్డు పరిస్థితి కూడా దయనీయంగా మారిందని తక్షణం ఈ రెండు ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఈడుపుగల్లు సర్పంచ్ పి.ఇందిర, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రులు నారాయణ, సత్యకుమార్‌లకు సత్కారం



మంత్రి నారాయణను సత్కరిస్తున్న బాపులపాడు మండల టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 16 : కూటమి ప్రభుత్వంలో ప్రమాణ స్వీకారం చేసిన మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌లను టీడీపీ బాపులపాడు మండలం నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం అమరావతి సచివాలయంలోని వారి పేషీలో మంత్రులను కలిశారు. ఈ కార్యక్రమంలో మొవ్వా వెంకటేశ్వరరావు, వడ్డిల్లి లక్ష్మీకుమారి, గరిమెళ్ల నరేంద్ర విజయసారధి, కోనంకి శ్రీధర్, పెమ్మసాని శైలజ పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

పెనమలూరు, జూన్ 16 : తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని సనత్‌నగర్, కృష్ణనగర్, సిద్దిఖ్‌నగర్, మురళీనగర్, యనమలకుదురు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో ఉన్న 15మసీదుల ముస్లిం సమాజం నిత్యం ఈద్ నమాజ్‌లు నిర్వహించుకోవడానికి కనీసం ఐదుఎకరాల స్థలం కేటాయించి ఈద్గా, షాదీఖానా తదితర నిర్మాణాలు చేపట్టేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం అశోక్‌నగర్ చెక్‌పోస్టు వద్ద ఉన్న మసీద్ ఏ సిద్దికియా రజీ కమిటీ సభ్యులతో షేక్ బుజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టుల్లోనూ, రియల్ ఎస్టేట్ మాఫియా గుప్పెట్లో ఉన్న భూముల్లో లాయర్లతో మాట్లాడి న్యాయసలహాలు తీసుకొని వీలైనంత త్వరలో రాష్ట్రంలోనే ఒక మోడల్ ఈద్గాను నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రేకుల మసీదు, యనమలకుదురు వంటి చోట్ల మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించుకోవడంలో ఇబ్బందులను తాను గ్రహించానని తెలిపారు. సనత్‌నగర్‌లో తనను నిన్నటి ఎన్నికల్లో సపోర్టు చేశారని, ఈద్గా నిర్మాణానికి తనవంతు సమకారం తన బాధ్యతని పేర్కొన్నారు. సనత్‌నగర్‌కు సంబంధించిన డ్రైనేజి సమస్యకు ఫుల్‌స్టాప్ పెడతామని పేర్కొన్నారు. రేకుల మసీదు వద్ద రోడ్డును వెడల్పు చేసి డ్రైను వాటర్‌ను బయటికి పంపే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, ఇమాం, ఇబ్రహీం, ఇక్బాల్, రియాజ్, సమీర్, అబిద్, బాషా, రెహమాన్, కరీం, ఇనయతుల్లామసీదు కమిటీ ప్రెసిడెంటు వాహేద్, కార్యదర్శి ఫజాల్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

కానూరు గ్రామంలోను, చుట్టుప్రక్కల ఉన్న డ్రైనేజి వ్యవస్థలను సత్వరమే మెరుగుపరచేందుకు తగు చర్యలు తీసుకుంటామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావులతో కలిసి కానూరు గ్రామంలోని డ్రైనేజి వ్యవస్థను పరిశీలించారు. ఏలూరు కాల్వ నుంచి కొత్త ఆటోనగర్, కానూరు బాడవ డొంక, హరిజనవాడ నుంచి చిన్నచెరువు వరకు ఉన్న ప్రధాన డ్రైన్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. డ్రైన్లలో మురుగు పారుదలకు అడ్డుగా ఉన్న తూటుకాడ, గుర్రపుడెక్క, తూముల్లోని సిల్టు తొలగించేందుకు వెంటనే యంత్రాలు ఏర్పాటు చేయాలని కమిషనరును ఆదేశించారు. ఆయన వెంట అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, డీఈ రాజారావు, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్, మాదు రామకృష్ణ, ఉప్పాల వెంకటేశ్వర్లు, తాతపూడి గణేష్, కరిమికొండ సురేష్, సత్రం శివయ్య ఉన్నారు.

ద్వారకాతిరుమలకు కాలినడకన మొక్కులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 16 : ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు విజయం సాధించి తద్వారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ద్వారకా తిరుమల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామిని మొక్కుకున్న నేపథ్యంలో కాలినడకన దర్శనం చేసుకుని మొక్కు చెల్లించాలని రంగన్నగూడెం, మడిచర్ల నుంచి టీడీపీ కార్యకర్తలు, మహిళలు ఆదివారం బయలుదేరి వెళ్లారు. రంగన్నగూడెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన టీడీపీ కార్యకర్తలు, తెలుగు మహిళ పాదయాత్రను యార్లగడ్డ సతీష్, ఆళ్ల గోపాలకృష్ణలు జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ నేత ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, తెలుగు మహిళ అధ్యక్షురాలు దోనవల్లి నాగశిరోమణి ఆధ్వర్యంలో 100మంది తెలుగుమహిళ కార్యకర్తలు గోవింద నామస్మరణలతో కాలినడకన ద్వారకాతిరుమల బయలు దేరారు. ఈ కార్యక్రమంలో కసుకుర్తి అర్జునరావు, కాట్రు పాపారావు, కొలుసు గంగాజలం, మొవ్వా విష్ణు, నెరుసు రమాదేవి, భవాని, తదితరులు పాల్గొన్నారు. మడిచర్ల నుంచి టీడీపీ మండల కార్యదర్శి పుట్టా సురేష్ ఆధ్వర్యంలో 28మంది టీడీపీ కార్యకర్తలు, మహిళలు ద్వారకా తిరుమలలో మొక్కులు చెల్లించేందుకు బయలుదేరి వెళ్లారు.

●ద్వారకాతిరుమలలోని చిన వెంకన్నస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోం మంత్రి అనిత పేర్లతో మూల్పూరి సాయికళ్యాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రంగన్నగూడెం నుంచి ద్వారకాతిరుమలకు పాదయాత్ర చేస్తున్న టీడీపీ మహిళ కార్యకర్తలు



వేమండ బాలాంబతల్లి గుడిలో మొక్కులు తీర్చుకున్న స్థానిక టీడీపీ నేతలు, తెలుగు మహిళలు

బాలాంబతల్లి గుడిలో మొక్కులు తీర్చుకున్న తెలుగు మహిళలు

ఉంగుటూరు : వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధిలేక నిర్వీర్యమైన రాష్ట్రాన్ని అభివృద్ధిపథం వైపు నడిపించి, సుభిక్షంగా మార్చగల సత్తా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికే వుందని ప్రజలు బలంగా నమ్మబట్టే టీడీపీ, జనసేన బీజేపీ కూటమికి భారీ మెజారిటీని అందించి అధికారాన్ని కట్టబెట్టారని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా వేమండ గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గ్రామదేవత బాలాంబతల్లి గుడిలో ఆపార్టీ నాయకులు, తెలుగుమహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి, పసుపు, కుంకుమలు, పూలు. పండ్లు, నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ, గ్రామపార్టీ అధ్యక్షుడు చాట్రగడ్డ శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు తోట నాగభూషణం, తోట నాగమణి, కాపుదాసి సునీల్, కానూళ్ల శ్రీనివాస్, ఫకీరు ప్రవీణ్, దుక్కిపాటి చంటి, హనుమోలు జనార్ధనరావు, శనగవరపు విజయలక్ష్మి, శనగవరపు సీతారత్నం, పార్వతి, రంగమ్మ, లక్ష్మి, కానూళ్ల శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు తెలుగు మహిళా బృందం

టీడీపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తోట నాగభూషణం సౌజన్యంతో, టీడీపీ మండల మహిళా అధ్యక్షు రాలు మండవ రమ్యకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 20మంది తెలుగు మహిళలు, 5గురు నాయకులతో కూడిన బృందం వివిధ వాహనాల్లో ద్వారకా తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

మానికొండ నుంచి శ్రీశైలంకు పాదయాత్ర

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చారిత్రాత్మక విజయం సాధించడంతోపాటు, సీఎంగా నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎంగా కొణిదెల పవన్‌కళ్యాణ్, మచిలీపట్నం ఎంపీగా వల్లభనేని బాలశౌరి, గన్నవరం ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావు అఖండ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా మండల పరిధిలోని మానికొండ గ్రామం నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు తోట సత్యనారాయణ (పండు), గోళ్ల వెంకటేశ్వరరావు(చిన్ని), సీతమ్మశెట్టి త్రినాథ్‌కుమార్, వీరంకి వెంకటశివ, రాజులపాటి రోహిత్, బుర్రా రవితేజ, చిల్లర రాజేష్ శనివారం రాత్రి శ్రీశైలం వరకు పాదయాత్ర చేపట్టారు.

కేన్సర్‌పై అవగాహన

పెనమలూరు, జూన్ 16 : అశోక్‌నగర్‌లోని రూట్స్ హెల్త్ ఫౌండేషన్‌లో ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా 45 ఏళ్ల నిండిన తల్లిదండ్రులకు ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ప్రోస్టేట్ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. సోమనాద్ ఆసుపత్రి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరు సోమలరాజ ఫౌండేషన్, హెచ్‌సీజీ క్యూరీ కేన్సర్ సెంటరు సహకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధార్థ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యార్లగడ్డ రూప్‌కుమార్, సంస్థ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ మాట్లాడుతూ పురుషులలో వచ్చే ప్రోస్టేటు క్యాన్సర్‌ను, మహిళలకు వచ్చే సర్వికల్ క్యాన్సరును పీఎస్ఏ, పాప్‌స్మియర్ పరీక్షల ద్వారా ముందుగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు శర్మ, నాగేశ్వరరావులను సన్మానించారు. 110 మందికి పీఎస్ఏ, బీఎండీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నే శివనాగేశ్వరరావు, సోమలరాజు ఫౌండేషన్ చైర్మన్ శివరాజు, శ్రీనివాస్, వెంకటరమణ, విజయలక్ష్మి, శ్రావణ్, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

జగన్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

కంకిపాడు, జూన్ 16 : అన్ని రంగాల్లో వైఫల్యం చెంది న జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొట్టారని, పాతాళానికి తొక్కే సారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు తన మొదటి సంతకం మెగా డీఎస్సీపై పెట్టడంతో పాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్‌లు పునరుద్ధరణ, రూ. 4 వేలు పింఛన్ వంటి సంక్షేమ పథకాలపై సంతకం చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, అన్నే ధనరామకోటేశ్వర రావు, బండి నాంచారయ్య, సుదిమళ్ల రవీంద్ర, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, బండి చంటి, టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, పందిపాటి సుధాకర్, బొప్పూడి శివరామకృష్ణ, ఏనుగ జయప్రకాష్, చలవాది రాజా, కొండా నాగేశ్వరరావు, బొర్రా వెంకట్, నీరుకొండ సుబ్బారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనం ఒక వ్యసనం..

పుస్తక పఠనం ఒక వ్యసనమని, అది ఉన్న వారు పుస్తక పఠనంలో పడితే అన్ని మరిచిపోతారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పునాదిపాడుకు చెందిన యార్లగడ్డ స్వరాజ్యలక్ష్మి రచించిన దీపం, డాక్టర్ సిహెచ్ బాబావలిరావు రచించిన ఆలోచనామృతం గ్రంథావిష్కరణ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు యార్లగడ్డ రాజారం, తహసీల్దార్ రామకృష్ణ, టీడీపీనాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, మద్దాలి సాయిబాబు, కాసరనేని కరుణ, ముసిబోయిన మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.



మంత్రి రామానాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆళ్ల గోపాలకృష్ణ

ప్రతి ఎకరాకు సాగునీరు

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 16 : రైతులతో కూడిన సాగునీటి సంఘాలతో అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఎకరాకు సాగునీరందించే విధంగా కృషి చేస్తానని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చినట్లు సాగునీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. జలవనరులశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి విజయవాడలోని కార్యాలయానికి విచ్చేసిన నిమ్మల రామానాయుడుకు జలవనరులశాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ, సాగునీటి సంఘాల మాజీ అధ్యక్షులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. గత ప్రభుత్వంలో జల వనరుల శాఖను నిర్వీర్యం చేయడం వల్ల రైతులు సాగునీటికి ఇబ్బందులెదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ, మైనేని మురళీకృష్ణ, యనమద్ది పుల్లయ్యచౌదరి, పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80

మంత్రి రవీంద్ర, పలువురు ప్రముఖుల బక్రీద్ శుభాకాంక్షలు

గుడివాడ/మచిలీపట్నం టౌన్ : త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ జరుపుకుంటారని మంత్రి కొల్లు రవీంద్ర ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ పేర్కొన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ పండుగను జరుపుకుంటారన్నారు. వ్యక్తిగత స్వార్థాన్ని వీడి సమిష్టి ప్రయోజనాల కోసం త్యాగాలకు సిద్ధపడినప్పుడే సమాజ హితం సాధ్యమవుతుందన్నారు. భక్తి భావానికి, విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు సంకేతమైన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని, అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న మాజీ ఎంపీ కనకమేడల దంపతులు

పృథ్వీశ్వరాలయంలో పూర్ణాహుతి

చల్లపల్లి, జూన్ 16 : ప్రముఖ శైవక్షేత్రం నడకుదురు పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో రాజగోపుర నిర్మాణం, అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనా దేవతామూర్తులు, పరివార దేవతా విగ్రహాల ప్రతిష్ఠ జరిపి రెండేళ్లయిన సందర్భంగా ద్వితీయ వార్షికోత్సవాలు రెండు రోజులపాటు వైభవంగా జరిగాయి. ఆదివారం పృథ్వీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్య హోమం, అష్టలక్ష్మి, మహాసుదర్శన హోమం, అఘోర పాశుపత హోమాలు నిర్వహించి మహాపూర్ణాహుతి జరిపారు. మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ - ఉషారాణి దంపతులు, ఆలయ అభివృద్ధి దాత మండవ రవీంద్ర - రమణకుమారి దంపతులు, మల్లుపెద్ది త్రివిక్రమరావు దంపతులు హోమం చేశారు. వేదపండితులు కంఠంరాజు సాయి గణపతి దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు కంఠంరాజు పృథ్వీకుమార్ శర్మ ప్రభృతులు పూజలు చేశారు. ఆర్టీసీ విశ్రాంత ఈడీ సూర్యదేవర రవీంద్రబాబు, స్థానిక పెద్దలు నాదెళ్ల ప్రభాకరరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, నాదెళ్ల శివరామకృష్ణ, భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు తిలకించారు.

విశ్వాసం పెంచిన చంద్రబాబు ఐదు సంతకాలు

● ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్దన్



అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం నారా చంద్రబాబు నాయుడు చేసిన తొలి ఐదు సంతకాలు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయని దక్కన్ ఫైనెసెస్ అధినేత, ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్దన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నిరుద్యోగ యువతలో నమ్మకాన్ని పెంపొందించేలా తొలి సంతకం మెగా డీఎస్సీపై చేయటం అభినందనీయమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అన్నా క్యాం టీన్ల పునరుద్ధరణతో పేదలు, కార్మికులకు తక్కువ ధరకు భోజన సదుపాయం అందే వెసులుబాటు ఏర్పడుతుందన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లను పెంపు చేయటం చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్తశుద్ధికి నిదర్శనమ న్నారు. నైపుణ్య గణన చేపట్టడం మంచి నిర్ణయమన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తే ఎంతో మంది స్వయంగా ఉపాధి అవకాశాలు పొందటంతోపాటు మరి కొంతమందికి ఉపాధి చూపగలుగుతారన్నారు.



తాడంకి వద్ద అండర్‌పాస్‌లో వర్షపునీరు

అండర్‌పాస్‌లో అష్టకష్టాలు

పమిడిముక్కల : విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిలో అండర్ పాస్‌లు వర్షపు నీరు నిలచి చెరువులను తలపిస్తూ ప్రమాదాలకు నెలవులుగా మారాయి. జాతీయరహదారిలో పమిడిముక్కల పరిధి తాడంకి, మంటాడ, పామర్రు పరిధి కురుమద్దాలి వద్ద అండర్ పాస్‌లలో వర్షపు నీరు పోయే మార్గంలేక చెరువుల్లా తయారవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సర్వీసు రోడ్లతో పాటు జాతీయ రహదారిపైనుంచి వర్షపునీరు వచ్చి అండర్‌పాస్‌లో చేరుతోంది. అండర్‌పాస్‌నుంచి వెళ్లేప్పుడు నీటిలో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలతో గాయాల పాలవుతున్నారు. బస్సులు వంటి భారీ వాహనాలు వెళ్లేప్పుడు నీరు లేచి పక్కన వెళ్లే వారిపై పడుతుంది. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఐ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తహసీల్దార్ హరనాథ్ బాధ్యతల స్వీకారం

నాగాయలంక : నాగాయలంక తహసీల్దార్‌గా ముప్పిరిశెట్టి హరనాథ్ నియమితులయ్యారు. శనివారం రాత్రి ఆయన కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో మంత్రి కొల్లు రవీంద్ర పీఏగా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా కలెక్టరేట్‌లో విధులను నిర్వహిస్తూ నాగాయలంక తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. తహసీల్దార్‌తో అనుబంధ మున్న మండల మత్స్యకార నేతలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.







అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



పెరిశేపల్లిలో కుమార్‌రాజా దంపతులకు సత్కారం



కోడూరులో చంద్రబాబు, పవన్ పటాలకు పాలాభిషేకం చేస్తున్న జనసైనికులు



చల్లపల్లిలో జనసేన సంబరాలు

రైతు సమస్యలు సత్వరం పరిష్కరించాలి

● ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశం

గుడివాడ, జూన్ 16 : అన్ని ప్రధాన పంట కాలువల్లో యుద్ధప్రాతిపదికన గుర్రపు డెక్క, తూడులను తొలగించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. ప్రజావేదికలో ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన ప్రతి చోట పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ సూర్య భరత్, ఏఈలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. ప్రజావేదికలో ఆదివారం విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ పాడైన వీధి దీపాల స్థానంలో కొత్తవి వేయాలన్నారు. కొత్త లైన్లు ఏర్పాటు చేయడానికి అంచనాలను రూపొందించాలన్నారు. నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఏడీలు వెంకటేశ్వరరావు, దశరథ్, ఏఈలు సుబ్బారెడ్డి, భానుప్రకాష్, ఫణీంద్ర పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన : కుమార్‌రాజా

పామర్రు : అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన కుమార్‌రాజా ఆదివారం పెరిశేపల్లిలో పర్యటించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కుమార్‌రాజా, సతీమణి విశ్రమ దంపతులకు గ్రామ ప్రముఖుడు, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కుమార్ రాజా మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలు మెచ్చే రీతిలో ముఖ్యమంత్రి చంద్రన్న పాలన ఉంటుం దన్నారు. పెరిశేపల్లి గ్రామ ప్రముఖులు చాపరాల వెంకటరమణ, చెరుకూరి వెంకటరత్న గిరిబాబు, కృష్ణామూర్తి, బాబూజీ, చెరుకూరి మురళీధర్, తాడిశెట్టి నరేష్, గొట్టిపాటి రామకృష్ణ, ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, తాడిశెట్టి సాంబశివరావు, సర్పంచ్‌లు చెరుకూరి వెంకటపద్మావతి, కాకి నాగేంద్రరావు, గొట్టిపాటి, మండపాక తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే కుమార్‌రాజా, విశ్రమ దంపతులకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్లరామయ్య ఆశీస్సులు అందజేశారు. **పామర్రు :** పాలశీతల కేంద్రం పంక్షన్ హాల్‌లో టీడీపీ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే కుమార్ రాజా కార్యాలయం నుంచి సన్మాన వేదిక వరకు విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. వల్లూరిపల్లి గణేష్, గొట్టపు రమేష్ మంతెన రామాంజనేయులు, బోదంకి సత్యనారాయణ, రావెళ్ల వాసు, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, ఈడే నాని, పరసా, సుబ్రమణ్యం, శ్రీహరి, సందీప్, చాట్ల రమేష్, కేదరాశిపల్లి శ్రీను, దాలిపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో జనసేన వేడుకలు

చల్లపల్లి : కూటమి ఘనవిజయం, బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో చల్లపల్లి జనసేన కార్యాలయంలో ఆదివారం రాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. బుద్ధప్రసాద్ తనయుడు, యువ నేత మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. బుద్ధప్రసాద్ విజయం కోసం శ్రమించిన ప్రతి జనసైనికునికీ, వీర మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆకుల స్వభూప్రసాద్, జి.వి.తాతారావు, నేతలు చోడగం విమల్ కృష్ణ, బొందలపాటి వీరబాబు, ఉస్మాన్ షరీఫ్, తోట కనక దుర్గ, ఉరిమి మణికాంత్, పసుపులేటి రవికుమార్, అడపా రవి, గోళ్ల ప్రసాద్, సోమిశెట్టి రాఘవేంద్రరావు, టీడీపీ నేతలు రావి చిట్టి, రావి రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

కోడూరు : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలు ఇచ్చి కీలక బాధ్యతలు అప్పగించటంపై జనసేన నేతలు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన సెంటర్‌లో జనసేన పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి శ్రేణులు పూతబోయిన కరుణ కుమార్, పాలడుగు ఆనందరావు, రామారావు, పూతబోయిన సాయిబాబు, కోట రాంబాబు, జరుగు పోతురాజు, పూతబోయిన లక్ష్మణరావు, యర్రంశెట్టి దామోదర్, బడే గాంధీ, బండే ఆంజనేయులు, కొండవీటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మెగా డిఎస్సీ ప్రకటించడాన్ని హర్షిస్తూ చారిత్రాత్మకమని తెలుగు యువత అధ్యక్షులు కూరాకుల వరప్రసాద్ ఆధ్వర్యంలో మాచవరం టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. భారీ బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, కూరాకుల శివయ్య, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, తోట రాంబాబు, పుట్టి ఏడుకొండలు, ముత్తిరెడ్డి అర్జునరావు, విస్సంశెట్టి సాంబశివరావు, అప్పికట్ల కృష్ణబాబు, కామేశ్వరరావు, మింగు రాంబాబు, అప్పికట్ల చిన్న వెంకటేశ్వరరావు, కూరాకుల శాంతిరావు, నరహరశెట్టి రమేష్, కైతేపల్లి పానకాలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో సమగ్రాభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జయప్రకాష్



మండవ రవితో తాతా జయప్రకాష్, బసవశంకరరావు

చల్లపల్లి : చంద్రబాబు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, కల్లుగీత కార్మిక ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాతా జయప్రకాష్ తెలిపారు. నడకుదురు పృథ్వీశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్న ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులభారం ఉన్నా ధైర్యంగా పేదలకు మేలు చేసే నిర్ణయాలు వెంటనే అమలులోకి తీసుకు వచ్చారని తెలిపారు. దీమా వ్యక్తం చేశారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేలుపు పృథ్వీశ్వరస్వామి అన్నారు. ఆలయాన్ని తన స్నేహితులైన మండవ రవీంద్ర అభివృద్ధి చేస్తున్న తీరుపట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. సోదరుడు తాతా బసవ శంకరరావు పాల్గొన్నారు.

శైవమహాపీఠం సెంట్రల్ కమిటీ ఎన్నికలు



మచిలీపట్నం టౌన్ : శైవమహాపీఠం సెంట్రల్ కమిటీ ఎన్నిక వివేకానంద మందిరంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మల్లంపల్లి భానుప్రకాష్ ఎన్నికల అధికారి గా వ్యవహరించారు. మచిలీపట్నం శైవమహాపీఠం గౌరవాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్, అధ్యక్షుడు మల్లంపల్లి నాగలింగ శాస్త్రి, కార్యదర్శి రవి కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే ఖబడ్దార్ : జనసేన

అవనిగడ్డ : ప్రజల ఆదరణ కోల్పోయిన వైసీపీ నాయకులు ఇంకా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే నిజాలు బయట పెట్టేందుకు తాము నిత్యం ముందుంటామని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు గుడివాక శేషబాబు అన్నారు. అవనిగడ్డలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వ్యవసాయం గురించి బుద్ధప్రసాద్‌ను విమర్శించే అర్హత, స్థాయి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాగిరెడ్డిని వెంట పెట్టుకుని గ్రామా ల్లో తిరిగిన రమేష్‌బాబు గెలిచాక చిన్ననాటి స్నేహితుడు అంబటి రాంబాబు ఇరిగేషన్ మంత్రి అయినప్పటికీ నియోజకవర్గానికి చేసిన మేలు ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రజా తీర్పుతో వైసీపీ నాయకులు మాట్లాడే అర్హత కోల్పోయారన్నారు. అబద్ధాలు మాట్లాడే ప్రయత్నం చేస్తే కూటమి పక్షాన గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం

● మరొకరికి తీవ్రగాయాలు

పామర్రు : పామర్రు - అవనిగడ్డ ప్రధాన రహదారిపై నాగపట్నం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం చెందగా, మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అవనిగడ్డ నుంచి గుడివాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు నాగపట్నం వద్ద రోడ్డుపక్క మార్జిన్‌లో నిలుచున్న గోవాడ సుబ్బారావు (70), ఎం.రాంబాబును ఢీకొంది. సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. రాంబాబుకు తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ తరలించారు. రాంబాబును చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. ఆర్టీసీ డ్రైవర్‌ను తక్షణమే అదుపులోకి తీసుకోవాలని మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కరకట్టపై మొరాయించిన ఆర్టీసీ బస్సును నెడుతున్న ప్రయాణికులు

మొండి బస్సు... సాయం పట్టండి!!

చల్లపల్లి : విజయవాడ నుంచి అవనిగడ్డ వస్తున్న ఆర్టీసీ కరకట్ట బస్సు నడకుదురు వద్ద సాంకేతికలోపంతో ఆదివారం ఉదయం ఆగిపోయింది. ప్రయాణికులను కిందకు దింపి, వారి సహకారంతో బస్సును రోడ్డు పక్కగా నిలిపారు. డిపో అధికారులకు సమాచారం అందించటంతో వేరొక బ స్సులో ప్రయాణికులను తరలించారు. బస్సు ఆగిపోవటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. పూర్తిస్థాయి కండీషన్ బస్సులు నడపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు : టీడీపీ

అవనిగడ్డ : ఐదు సంతకాలు చేసి సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని టీడీపీ నేతలు కొల్లూరి వెం కటేశ్వరరావు, బండే రాఘవ, బండే శ్రీనివాసరావు అన్నారు. మెగా డిఎస్సీ ప్రకటన, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పింఛన్ పెంపుతో విశ్వాసం కలిగిందన్నారు. సుధాకర్, సోమశేఖర్, పిల్లి మల్లిఖార్జునరావు, బచ్చు రఘునాథ్, మండలి రామ్మోహన్, చందన రంగారావు, కొక్కిలిగడ్డ యెహాను పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం



లలిత సహస్ర నామ పారాయణ చేస్తున్న సువాసినులు

మచిలీపట్నం టౌన్ : రాబర్టుసన్‌పేట రామలింగేశ్వర స్వామి, రంగనాయక స్వామి దేవా లయాల్లో స్వామి వారి కల్యాణోత్స వాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామిని పెండ్లికు మారునిగా తీర్చిదిద్దారు. చలమలశెట్టి కృష్ణ, శ్రీలక్ష్మి దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణం జరిపించారు. ప్రారంభించారు. బాపేశ్వర యాజ్ఞీకం నిర్వహిస్తున్నారు. ఈవో సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. రంగనాయక స్వామి దేవాలయంలో అంకురారోపణతో కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈవోకె.వి. గోపాలరావు పర్యవేక్షణలో కల్యాణోత్సవాలు ప్రారంభించారు. లలితా సహస్ర నామ పారాయణ చేశారు. సామూహికంగా భగవద్గీత పారాయణ, గోవింద నామాలు పఠించారు.

ప్రసన్నాంజనేయస్వామికి లక్ష మల్లెల అర్చన



అవనిగడ్డ రూరల్ : తుంగలవారిపాలెం ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో భోగిరెడ్డి నరసింహారావు - ప్రియాంక వివాహ మహోత్సవం నేపథ్యంలో సోదరుడు భోగిరెడ్డి రామాంజనేయులు - రాధిక దంపతులు లక్ష మల్లెల పూజ నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మురళీ, అర్చక బృందం పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు వేకనూరు సూర్యనారాయణ స్వామికి శాంతి కల్యాణం రాజశేఖర శర్మ బ్రహ్మత్వంలోనిర్వహించారు. పొన్నూరు పరమేశ్వరరావు - భారతి లక్ష్మీ దంపతులు కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అమ్మన్న మృతి

నాగాయలంక : నాగాయలంక మండల పరిషత్ ఉపాధ్యక్షురాడు, భావదేవరపల్లి వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు పరిశె అమ్మన్న (67) భావదేవరపల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే సింహా ద్రి రమేష్‌బాబు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముమ్మారెడ్డి రాజశేఖర్, కూనపరెడ్డి నాగమల్లేశ్వరరావు, ఆవుల వెం కట కృష్ణారావు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.


ఫొటోగ్రఫీలో ఆధునిక మార్పులపై అవగాహన

అవనిగడ్డ : మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా ఫొటోగ్రాఫర్లలో మార్పు అనివార్యమని వక్తలు పేర్కొన్నారు. అవనిగడ్డ అజంతా కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం దివి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పికట్ల శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు సీనియర్ ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ ప్రజల అభిరుచికి తగినరీతిలో ఫొటోగ్రఫీ అందించాల్సిన రోజులు వచ్చాయన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్‌లు చన్నగిరి లతామోహన్, రత్నానంద్, మేడా రాజారావు, సింహాద్రి కృష్ణప్రసాద్, మోపిదేవి అంజలి శంకర్ తదితరులు పాల్గొని ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు వివరించారు. సమస్యలపై యువ ఫొటోగ్రాఫర్లు తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. శరత్ చంద్ర, చేబ్రోలు రామకృష్ణ, బాసు లంకబాబు, కోడూరు శ్రీనివాసరావు, ఒడుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గుడివాడ : పద్మావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం చిన అవుటపల్లి డాక్టర్‌పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె, నరాల సంబంధిత వ్యాధులపై వైద్య సేవలందించారు. క్లబ్ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు డా.సి.సూర్యచంద్రరావు, గుళ్ళపల్లి కిరణ్‌బాబు మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రతి నెలా మొదటి, మూడో ఆదివారాల్లో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ఆకస్మిక మరణాలు సంభవిస్తున్న వేళ ముందస్తుగానే ఆరోగ్య పరీక్షలు చేయించుకో వాలన్నారు. మెడికల్ కళాశాల, ఆసుపత్రి వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సతీష్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



నాగాయలంక : భారత రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రీయ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ జి.సతీష్ రెడ్డి దంపతులను ఆదివారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో కలిశారు. నాగాయలంక మం డలంలో గుల్లలమోదలో క్షిపణి ప్రయోగ కేంద్రం మంజూరుకు విశేష కృషి చేసినం దుకు మండలి బుద్ధప్రసాద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను ఛైర్మన్‌తో మండలి చర్చించారు.

ఎమ్మెల్యే వెనిగండ్లను కలిసిన ఆర్డీవో పద్మావతి



గుడివాడ : గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఆదివారం ప్రజావేదికలో ఆర్డీవో పి.పద్మావతి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని రెవెన్యూ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల కోరారు. డిప్యూటీ తహసీల్దార్ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

